సాక్షి కామారెడ్డి

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



బిజినెస్ పాటిల్..

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బిజినెస్ పాటిల్ అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విమర్శించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
40.3 /23.2

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: గ్రూప్స్ ఉచిత శిక్షణ కోసం 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్ కార్యాలయంలోని రూమ్‌నంబర్ 113లో గానీ, 86863 88215 నంబర్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగ ఉద్యోగులను మినహాయించాలి



బాన్సువాడ : దివ్యాంగ ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీపీటీఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ ఆర్డీవో, ఎన్నికల అధికారి రమేష్ రాథోడ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధ పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు, మచ్చేందర్, బంటు సాయిలు, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు సైబర్ జాగృతి దివస్

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో సైబర్ నేరాల సంఖ్య అదేస్థాయిలో పెరిగిందని, వాటిని అరికట్టడానికి ప్రతి నెలా మొదటి బుధవారం సైబర్ జాగృతి దివస్ నిర్వహిస్తున్నామని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ప్రజలకు సమర్థవంతంగా సేవలందించడమే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. సాంకేతిక పద్ధతులకు తగ్గట్టుగా దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ క్రైం యూనిట్ల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఎవరైనా సైబర్ నేరాగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసపూరిత లావాదేవీలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే వాటిని తక్షణం నిలిపివేసి సంబంధిత ఖాతాను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సైబర్ నేరాల కేసుల్లో పూర్తిస్థాయి ఆధారాలను సేకరించి నేరస్తులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆదేశాల మేరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ప్రతినెలా మొదటి బుధవారం నిర్వహించాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న కాలువ మరమ్మతులు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీ సమీపంలో గల నిజాంసాగర్ కెనాల్ కట్టకు మరమ్మతులు కొనసాగుతున్నాయి. రెండో రోజు జేసీబీ సహాయంతో పనులు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాయిన కాలువ తెగిపోయి కాలనీలోని పలు ఇళ్లలోకి నీరు చేరిన విషయం తెలిసిందే. కాగా అధికారులు ఇప్పటి వరకు తమకు ఎలాంటి సహాయం చేయలేదని బాధితులు పేర్కొన్నారు.

‘గులాబీ’ల పోరుబాట

- రైతుల సమస్యలే ఎజెండా
- వరికి బోనస్, దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు
- 6న దీక్షలకు పిలుపు

ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పోరుబాట పట్టింది. రైతుల సమస్యలే ఎజెండాగా ఆందోళనలకు కార్యాచరణ రూపొందించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన గులాబీ దళం.. ఈనెల 6న నియోజకవర్గ కేంద్రాలలో దీక్ష చేయడానికి సన్నద్ధమవుతోంది.

– సాక్షి, కామారెడ్డి



కలెక్టరేట్ వద్ద బీఆర్‌ఎస్ నేతలు పోచారం, గంప, జాజాల, హన్మంత్ సింధే తదితరులు

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత సుమారు పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీకి ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో ఎదురు దెబ్బ తగిలింది. అధికారానికి దూరమైన ఆ పార్టీ.. ప్రజలకు చేరువయ్యేందుకు యత్నిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యంగా రైతు సమస్యలపై పోరాటానికి సిద్ధమైంది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంటకు క్వింటాలుకు రూ.5 వందల బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని ఆరోపిస్తున్నారు. యాసంగి పంట చేతికందిన నేపథ్యంలో రైతుల నుంచి కొనుగోలు చేసే వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై పోరుబాట పట్టిన బీఆర్‌ఎస్ నేతలు.. మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్ సింధే, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వరికి బోనస్ విషయంలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోతే ఆందోళనలు ఉధృతం చేయాలని నిర్ణయించారు.

క్షేత్రస్థాయిలో..

రైతు సమస్యలపై ఉద్యమాలు చేయడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోంది. ఇటీవల వడగళ్లతో దెబ్బతిన్న పంటలను మాజీ ఎమ్మెల్యేలు పరిశీలించారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాజాగా భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు ఎత్తిపోవడంతో దెబ్బతిన్న పంటలను కూడా నేతలు పరిశీలించి రైతులకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు లింగంపేట మండలంలోని లింగంపల్లి శివారులో ఎండిపోయిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరి పంటకు బోనస్‌తో పాటు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 6న దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. ఆయా అంశాలలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు గులాబీ నేతలు ప్రకటించారు. దీక్షలను విజయవంతం చేయడానికి నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరు గ్యారంటీల అమలు కోసం..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో 13 పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీల అమలును మర్చిపోయిందని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రైతులకు సంబంధించిన రూ.2 లక్షల పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. కౌలు రైతులు, రైతు కూలీలనూ ఆదుకుంటామని వాగ్దానం చేసిన కాంగ్రెస్.. రైతుబంధు పథకాన్ని సక్రమంగా అమలు చేయలేకపోతోందని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసేదాకా కొట్లాడుతామని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు.



పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న పోచారం

వాహనాల తనిఖీలకు సహకరించాలి



మద్నూర్(జుక్కల్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, అధికారులు చేపడుతున్న వాహనాల తనిఖీలకు ప్రజలు సహకరించాలని జిల్లా రవాణా శాఖ, ఎన్నికల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల, ఆర్టీవో చెక్‌పోస్ట్‌లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. అక్రమంగా డబ్బు, మద్యం తరలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంవీఐ సుభాష్, ఏఎంవీఐ రాంచందర్‌నాయక్, సిబ్బంది ఉన్నారు.

పోలీసు స్టేషన్ నుంచి నిందితుల పరార్

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): దొంగతనం కేసులో విచారణకు తీసుకువచ్చిన ఇద్దరు నిందితులు పోలీసు స్టేషన్ నుంచి పరారయ్యారు. సౌత్ సీఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో దొంగతనం చేశారనే అనుమానంతో పోలీసులు సోమవారం ఉదయం ముగ్గురిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అయితే రాత్రి టౌన్‌లో విధులు నిర్వహించిన పోలీసులు మంగళవారం తెల్లవారుజామున నిర్లక్ష్యంగా ఉండటాన్ని గమనించిన ఇద్దరు నిందితులు స్టేషన్ నుంచి పరారీ అయ్యారు. పారిపోయిన వారిని మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ సిరాజ్, ఆటోనగర్ అక్బర్ బాగ్‌కు చెందిన సయ్యద్ జీషన్‌గా పోలీసులు గుర్తించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు సౌత్ సీఐ తెలిపారు. జిల్లాలోని శివారు ప్రాంతంలోని పోలీసులకు సమాచారం అందించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- వరికి రూ.500 బోనస్ ఇవ్వాలి
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్

కామారెడ్డి క్రైం: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.5 వందల చొప్పున బోనస్ ఇవ్వాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. పోచారంతో పాటు మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, జాజాల సురేందర్, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తదితరులు కలెక్టరేట్‌కు రాగా.. పోలీసులు ప్రధాన గేటు వద్ద అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఒక్కసారిగా అందరినీ లోపలికి అనుమతించడం వీలుకాదన్నారు. వాహనాలను లోనికి అనుమతించకపోవడంతో పోలీసుల తీరుపై పోచారం అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్య నేతలు కలెక్టర్ చాంబర్‌కు వెళ్లి కలెక్టర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ యాసంగిలో ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని, పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న నియోజకవర్గ కేంద్రాలలో దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఎల్.నర్సింగరావు, బాలమణి, జెడ్పీటీసీలు మనోహర్‌రెడ్డి, రాంరెడ్డి, నాయకులు అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావ్, సత్యంరావ్, కపిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నేతలు పోచారం, గంప, జాజాల, హన్మంత్ సింధే

కమలం గూటికి జుక్కల్ మాజీ ఎమ్మెల్యే



తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

- తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీలో చేరిన గంగారాం

సాక్షి, కామారెడ్డి: జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్‌లో కొనసాగిన సౌదాగర్ గంగారాం కమలం గూటికి చేరారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ రావ్ చవాన్ ఆధ్వర్యంలో ఆయన బీజేపీ ముఖ్య నేతలను కలిసి, కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. జుక్కల్ నియోజకవర్గంతో సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉన్న సౌదాగర్ గంగారాం తొలిసారి 1978 లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. 1983 ఎన్నికల్లోనూ ఆయన విజయం సాధించారు. 1985లో జరిగిన ఎన్నికలలో ఓటమి పాలయ్యారు. 1989లో గెలిచినా, 1994, 1999 ఎన్నికలలో వరుసగా ఓటమి చవిచూశారు. 2004 లో మరోసారి గెలుపొందారు. 2009 లో గంగారాం బదులు ఆయన భార్య సావిత్రి ఎన్నికల బరిలో దిగినా ఓటమి తప్పలేదు. 2014, 2018 ఎన్నికల్లో పోటీ చేసిన గంగారాం.. విజయ తీరాలకు చేరలేకపోయారు. 2023 ఎన్నికల్లో టికెట్టు కోసం చివరి నిమిషం దాకా ప్రయత్నించినా.. నిరాశే ఎదురయ్యింది. ఆయనను కాదని కాంగ్రెస్ నాయకత్వం లక్ష్మీకాంతారావుకు టికెట్టు ఇచ్చింది. దీంతో నిరాశ చెందిన గంగారాం.. బీఆర్‌ఎస్ అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలతో పార్టీనుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పటి నుంచి సైలెంట్‌గా ఉంటూ వస్తున్న గంగారాం ఎంపీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ వైపు మొగ్గు చూపారు. మంగళవారం ఢిల్లీ వెళ్లిన ఆయన బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

కామారెడ్డి క్రైం: ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు కూలీలు తక్కువ సంఖ్యలో వస్తున్న గాంధారి, నస్రుల్లాబాద్, బిచ్కుంద మండలాల ఎంపీడీవోలు రాజేశ్వర్, గోపాల్, నీలావతిలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఉపాధి హామీ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీటి వసతి కల్పించాలని, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, వాష్ బేసిన్స్ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతి మండలంలో పనుల పర్యవేక్షణకు ఇంజినీరింగ్ అధికారులను నియమించామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలన్నారు. నీటిని వృథా చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటార్లను అద్దెకు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి వసతి, నీడ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఆశ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉండేలా అధికారులు చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, పంచాయతీ రాజ్ ఈఈ సదాశివరెడ్డి, డీపీవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పాఠశాలల్లో మరమ్మతులు చేయించాలి

కామారెడ్డి క్రైం: వేసవి సెలవులు ముగిసేలోగా జిల్లాలోని పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, పనుల కార్యాచరణపై కలెక్టరేట్‌లో మంగళవారం ఆయా శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,013 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయనున్నామన్నారు. హెచ్‌ఎం, మహిళా సంఘాలలోని సభ్యులతో ఈ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతి గదుల మరమ్మతులు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలను గుర్తించాలన్నారు. అవసరమైన అన్ని మరమ్మతులు చేయించాలన్నారు. జాతీయ బ్యాంకుల్లో కమిటీలకు సంబంధించిన ఖాతాలు తెరవాలని సూచించారు. సమావేశంలో డీఈవో రాజు, పీఆర్ ఈఈ సదాశివరెడ్డి, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, మహిళలు

నకిలీ ధ్రువపత్రాలతో పాస్‌పోర్టులు

- ఏజెంట్లతో కుమ్మక్కవుతున్న కొందరు ఎస్‌బీ అధికారులు
- ఖతర్ వెళ్తూ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన దొన్కల్ వాసి

మోర్తాడ్(బాల్కొండ): శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఖతర్‌కు వెళ్లే ప్రయత్నంలో నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం దొన్కల్‌కు చెందిన సాయి అనే యువకుడిని సోమవారం ఇమిగ్రేషన్ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నకిలీ ధ్రువపత్రాలు, తప్పుడు సమాచారం ఇచ్చి ఆ యువకుడు రెండో పాస్‌పోర్టును పొందాడని విదేశాంగ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ఫలితంగా సాయి ఖతర్‌కు వెళ్లలేకపోగా చేసిన తప్పుకు కటకటాలు లెక్కించాల్సి వచ్చింది. గతంలో వేల్పూర్‌కు చెందిన మురళి తప్పుడు ధ్రువపత్రాలతో పాస్‌పోర్టును పొంది దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడి ఎయిర్‌పోర్టులో మురళికి గతంలో ఒక పాస్‌పోర్టు జారీ కాగా మరోసారి తక్కువ వయస్సును చూపి రెండో పాస్‌పోర్టును పొందాడని దుబాయ్ పోలీసులు గుర్తించి ఇంటికి పంపించారు. కరీంనగర్ కేంద్రంగా సాగిన నకిలీ పాస్‌పోర్టుల వ్యవహారం ఇంకా సద్దుమణగక ముందే దొన్కల్ వాసీ అరెస్టు కావడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

విదేశాంగ శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా..

పాస్‌పోర్టుల జారీలో విదేశాంగ శాఖ ఎన్నో కఠిన నిబంధనలను అనుసరిస్తోంది. సరైన ధ్రువపత్రాలు లేకుండా పాస్‌పోర్టులను జారీ చేసే వీలు లేదు. కాగా కొందరు ఏజెంట్లు స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) అధికారులతో కుమ్మక్కై, నకిలీ పత్రాలను సృష్టించి గతంలో పాస్‌పోర్టు పొందినవారికి మరోసారి వేరే వివరాలతో రెండో పాస్‌పోర్టును ఇప్పిస్తున్నారు. పాస్‌పోర్టు సేవా కేంద్రాలు, ఎస్‌బీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించి నకిలీ ధ్రువపత్రాలకు పాస్‌పోర్టులను జారీ చేసేలా ఆమోదం తెలుపుతున్నారు. కాగా ఇమిగ్రేషన్ సందర్భంలో నకిలీ పాస్‌పోర్టులు బట్టబయలవుతున్నాయి.

భారీ మొత్తంలో ముడుపులు

నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను జారీ చేసే వ్యవహారంలో భారీ మొత్తంలో నగదు చేతులు మారుతోంది. కొందరు ఎస్‌బీ అధికారులు పాస్‌పోర్టు ఏజెంట్లతో చేతులు కలిపి తప్పుడు ధ్రువపత్రాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పాస్‌పోర్టులు చేతికి అందేలా చేస్తున్నారు. నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను జారీ చేయడంలో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ముడుపులను స్వీకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రోహింగ్యాలకూ పాస్‌పోర్టులు..

గతంలో జిల్లాలోని బోధన్ కేంద్రంగా రోహింగ్యాలకు ఇక్కడి చిరునామాలపై పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. ఏకకాలంలో 80 మంది రోహింగ్యాలకు ఎస్‌బీ అధికారుల అత్యాశతో పాస్‌పోర్టులు జారీ అయ్యాయి. స్టేట్ ఇంటెలిజెన్స్ విచారణలో ఈ తతంగం బయటపడగా ఈ కేసును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీరుగార్చిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికీ ఇమిగ్రేషన్ అధికారుల పరిశీలనలో నకిలీ పత్రాలతో జారీ అయిన పాస్‌పోర్టులు బయటపడటం, సంబంధిత యువకులు జైలు పాలుకావడం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులు అప్రమత్తమై నకిలీ పత్రాలతో పాస్‌పోర్టు పొందిన వారిని, ఈ అక్రమాలకు ఊతమిచ్చిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

‘బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి’



బీజేపీ ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జహీరాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ ప్రజలను కోరారు. మంగళవారం కామారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బీజేపీ ప్రచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. సుస్థిర పాలన, వికసిత భారత్ బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, పండ్ల ప్రవీణ్, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిద్ధరామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్వామివారి విగ్రహంతో పాటు మాత భువనేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పూజారి రామగిరి శర్మ మంగళవారం అవభృతస్నానం చేయించారు. విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదం పంచి పెట్టారు. ఉత్సవాల్లో ఆలయ ఈవో శ్రీధర్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందె మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తాటిపాముల లింబాద్రి, నీల అంజయ్య, కల్లురి సిద్ధరాములు, పూజారి రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఉపాధ్యాయుల వినతి

కామారెడ్డి అర్బన్: లోక్‌సభ ఎన్నికల విధుల్లో అనారోగ్య సమస్యలతో బాధపడే ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.మనోహరరావు, జె.లక్ష్మీరాజం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అలాగే పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక బస్సులు, కేంద్రాల్లో సౌకర్యాలు, ఫర్నిచర్ కల్పించాలని కోరారు.

'ఆసరా' కోసం ఎదురు చూపులు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచలో ఆసరా పింఛన్ కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రతి నెలా లబ్ధిదారుల వేలిముద్రలు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి వేలిముద్రతో పింఛన్ అందుకుంటున్నారు. కానీ సదరు జీపీ కార్యదర్శి విధులకు సకాలంలో హాజరు కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తండ్రి కలను నెరవేర్చిన తనయ



దాక్టరు పట్టాతో నీరుడి ప్రీతి కమల

భిక్కనూరు/ ఎల్లారెడ్డి రూరల్: జీవితంలో ఉన్నత శిఖరానికి చేరుకోవాలన్న తన తండ్రి కలను నేరవేర్చింది ఓ తనయ. నాగిరెడ్డిపేట మండలం గోలిలింగాల గ్రామానికి చెందిన నీరుడి ప్రవీణ్ కుమార్ భిక్కనూర్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. తన తల్లి దివంగత కమలకు ఇచ్చిన మాట ప్రకారం.. కుమార్తె నీరుడి ప్రీతి కమలను డాక్టర్ చేయాలని కల కన్నాడు. ఆ దిశగా ప్రీతి తండ్రి చెప్పిన బాటలో నడుస్తూ అనుకున్న ఎంబీబీఎస్ ఉన్నత లక్ష్యాన్ని నెరవేర్చి తండ్రి మొఖంలో ఆనందాన్ని నింపింది. నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించిన ప్రీతి సోమవారం రాత్రి కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి పట్టా అందుకుంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ 'సాక్షి'తో తన ఆనందాన్ని పంచుకున్నారు. గతంలో గ్రామంలో వైద్య సదుపాయాలు లేక తన తల్లి కమల అనారోగ్యానికి గురై మృతి చెందింది. తన తల్లికి ఇచ్చిన మాట ప్రకారం మనువరాలు అయిన ప్రీతిని డాక్టర్‌గా చేయాలనేది నా కల. ఆ కల నేడు విజయవంతం కావడంతో ఆయనతో పాటు గ్రామస్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లలో పలకరించింది లేదు

రైతులను కేసీఆర్ పట్టించుకోలేదు

- ఇప్పుడు పంటలను పరిశీలించడం ఆశ్చర్యమేస్తోంది
- కవిత జిల్లాకు మహిళా డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను తీసుకురాలేకపోయింది
- మోదీ ప్రకటించిన పసుపు బోర్డు ఎక్కడో స్పష్టత లేదు
- షుగర్ ఫ్యాక్టరీ పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారు
- ఎన్నికల్లో కవితకు పట్టిన గతే అర్వింద్‌కు పడుతుంది
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శలు



కాంగ్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ముఖ్యమంత్రిగా కొనసాగిన పదేళ్లలో కేసీఆర్ ఎక్కడ కూడా రైతులను పలకరించింది లేదని, ఇప్పుడు పంటలను ఆయన పరిశీలించడం ఆశ్చర్యమేస్తోందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంటలకు కనీస మద్దతు ధరను పెంచాలని రైతులు ఢిల్లీ వీధుల్లో ధర్నాలు చేస్తున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కేసీఆర్ పంట బీమా పథకాన్ని పెట్టకపోవడంతో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోతున్నా పరిహారం అందడం లేదన్నారు. ఎంపీగా, ఎమ్మెల్సీ హోదాలో కొనసాగిన కేసీఆర్ కూతురు కవిత నిజామాబాద్‌కు మహిళా డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలను తీసుకురాలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనే నిజామాబాద్‌నగరం అభివృద్ధి చెందిందని, బీఆర్ఎస్, బీజేపీలు చేసిందేమీ లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే నిజామాబాద్‌కు స్మార్ట్‌సిటీతోపాటు పంట దిగుబడులకు కనీస మద్దతు ధర చట్టం కోసం పోరాటం చేస్తానని ప్రకటించారు. రాష్ట్రంలో కోరుకున్న విధంగానే దేశ ప్రజలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, పార్టీ సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, నగేశ్‌గౌడ్, రత్నాకర్, రామర్తి గోపి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణురాజ్ పాల్గొన్నారు.

కొత్త నాటకం

ఎంపీ అర్వింద్ చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తామని కొత్త నాటకాని తెర లేపారని జీవన్‌రెడ్డి విమర్శించారు. ఎంపీగా కొనసాగిన కాలంలో చెరుకు ఫ్యాక్టరీల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. జగిత్యాల, నిజామాబాద్‌లో పసుపు బోర్డు ప్రకటన చేసిన నరేంద్ర మోదీ.. ఎక్కడ ఏర్పాటు చేస్తామనేది స్పష్టం చేయలేదన్నారు. పసుపు బోర్డు నిజామాబాద్‌కు వస్తుందా? లేక అహ్మదాబాద్‌కు వెళ్తుందా? అని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అర్వింద్ ఎక్కడా అభివృద్ధి చేయలేదని, ఎంపీ ఎన్నికల్లో ఎన్నికల్లో కవితకు పట్టిన గతే ఇప్పుడు అర్వింద్‌కు పడుతుందన్నారు.

2025లో చెరుకు గానుగ

రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు సిద్ధంగా ఉందని, 2025 డిసెంబర్ నాటికి షుగర్ ఫ్యాక్టరీలో గానుగ ఆడిస్తామన్నాని జీవన్‌రెడ్డి అన్నారు. అంత వరకు రైతులు చెరుకు సాగు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం పంట బీమా పథకాన్ని వర్తింపజేస్తుందని, ఏకకాలంలో రూ.2లక్షల రుణామాఫీ, వచ్చే ఖరీఫ్ నుంచి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందిస్తామని తెలిపారు.

వారివి కుమ్మక్కు రాజకీయాలు

నన్ను ఓడించేందుకు అర్వింద్, జీవన్‌రెడ్డి కుట్రలు

- గెలిపిస్తే ఎయిర్‌పోర్టుతోపాటు పసుపు బోర్డు తీసుకొస్తా
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు జీవన్‌రెడ్డి, అర్వింద్ కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. తాను గెలిస్తే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని ఓడించేందుకు ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయని అన్నారు. మండలంలోని నర్సింగ్‌పల్లిలో మంగళవారం బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు బీఆర్ఎస్ నాయకురాలు లక్ష్మక్క మృతికి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. 115 రోజుల పాలనలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమైందని, ముఖ్యంగా రైతుబంధు, రూ.500 బోనస్, విద్యుత్ కోతలు, తదితర వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో వెన్నుపోటుదారులను గుర్తించలేదని, రాజకీయంగా, ఆర్థికంగా, వ్యాపారపరంగా లబ్ధి పొంది పార్టీలు మారుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడుతోందని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఎన్ని కేసులైనా అండగా ఉంటానన్నారు.

వైఎస్‌తోనే కాంగ్రెస్ చచ్చిపోయింది

వైఎస్ రాజశేఖర్‌రెడ్డితోనే కాంగ్రెస్ చచ్చిపోయిందని, ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నది డూప్లికేట్ కాంగ్రెస్ అని బాజిరెడ్డి అన్నారు. వైఎస్ ఒక్కరే అసలైన కాంగ్రెస్ నాయకుడని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కాగానే రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లిపోతారని ఆరోపించారు. కేసీఆర్ అసలైన రైతు నాయకుడని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో రాష్ట్రంలో పాలన సాగుతోందని ఆరోపించారు.

అర్వింద్‌పై సొంత పార్టీ నేతల్లోనే వ్యతిరేకత

ఐదేళ్లు కాలక్షేపం చేసిన బీజేపీ ఎంపీ అర్వింద్‌ను సొంత పార్టీ నేతలతోపాటు అన్నివర్గాలు వ్యతిరేకిస్తున్నాయని బాజిరెడ్డి అన్నారు. తండ్రీకొడుకులు ఎంపీలుగా జిల్లాకు ఒరగబెట్టిందేమీ లేదని మండిపడ్డారు. పసుపు బోర్డు కేవలం పేపర్‌కే పరిమితమైందని, ఒక్క హామీకూడా అమలు చేయలేదన్నారు. తాను ఎంపీగా గెలిస్తే పసుపు బోర్డు, జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు తీసుకువస్తానన్నారు. 40 రోజులు తన కోసం కష్టపడితే ఐదేళ్లు అండగా ఉంటానన్నారు. అంతకుముందు జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీజీ గౌడ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ప్రసంగించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీనివాస్, ఒన్నాజీపేట్ గోవర్ధన్, శ్రీని వాస్‌రావు, నాగేశ్వర్‌రావు, ఉమాపతిరావు, ము త్యంరెడ్డి, నరేశ్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, భూమయ్య, అజీమ్, మధుకర్, గోపాల్‌రెడ్డి, సిద్ధార్థ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

బీబీ పాటిల్ కాదు.. బిజినెస్ పాటిల్

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: ఎంపీ బీబీ పాటిల్ కాదని అతడు బిజినెస్ పాటిల్ అని పాటిల్‌కు జహీరాబాద్ ప్రజలు బాయ్ బాయ్ చెప్పే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ బీబీ పాటిల్ తన బిజినెస్‌ల కోసం మాత్రమే పార్టీలలో చేరి బిజినెస్‌ను అభివృద్ధి చేసుకుంటున్నాడే తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగపడడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో పాటిల్ బీజేపీలో చేరారని అన్నారు. పదేళ్ల పాటు ఎంపీగా ఉన్న పాటిల్ తన నియోజకవర్గంలో పట్టుమని పది మందిని సైతం గుర్తు పట్టలేని స్థితిలో ఉన్నారని అన్నారు. పదేళ్లలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయని పాటిల్ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేయని పాటిల్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎంపీగా ఆస్తులను కూడకట్టుకున్నారే తప్ప ప్రజలకు సేవ చేసిందేమీ లేదన్నారు. ఎంపీ నిధులు ఉన్న ఎలాంటి పనులు చేయక పోవ డంతో రూ. 50 కోట్ల నిధులు ల్యాప్స్ అయ్యాయన్నారు. గాంధారి మండలాన్ని దత్తత తీసుకుని గాంధారిని ఎలాంటి అభివృద్ధి చేయకుండా టర్మ్ పూర్తి చేశారన్నారు. పదేళ్లలో చేసిన అక్రమ సంపాదన విషయం బయట పడుతుందనే భయంతో బీజేపీలో చేరారని ఆరోపించారు. బీజేపీలో చేరిన వారికి ఎలాంటి ఈడీ దాడులుండవని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎల్లారెడ్డిరూరల్: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. లింగంపేట మండలంలోని పర్మల్ల నుంచి గోపాల్‌పేటకు సోమవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి ట్రాక్టర్ యజమాని రమావత్ రమేశ్, డ్రైవర్ రమావత్ లింబియాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'వరి' గోస



ఎండిపోయిన వరి పంటను చూపుతున్న రైతు

రాజంపేట: మండల పరిధిలోని చాలా మంది రైతులు వరి పంటకు నీరు లేక ఎండిపోతున్నాయి. రూ. వేలు ఖర్చు చేసి పంట సాగు చేస్తే చివరి దశలో బోర్లు ఎత్తివేయడంతో పూర్తిగా దెబ్బతింది. గ్రామానికి చెందిన నాయిని శ్రీను రెండు ఎకరాలు, కూరెల్లి నాగరాజుకు ఉన్న ఒక ఎకరం భూమిలో వరి పంటను సాగు చేశారు. 20 రోజులుగా బోర్లు ఎత్తివేయడంతో పంట పూర్తిగా ఎండియి దెబ్బతిన్నది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

తెల్ల కంకితో నష్టపోయిన రైతులు



బీర్కూర్‌లో పొల్లుపోతున్న పంటలను చూపిస్తున్న రైతులు

బాన్సువాడ: పంట కోసే దశలో ధాన్యం గింజలు తెల్ల కంకి (పొల్లు)తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు గ్రోమోర్‌లో ఆర్‌కే మసూరి విత్తనాలను కొనుగోలు చేశారు. విత్తనాలు నాటి, నారు వేసి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు వచ్చింది. గ్రోమోర్‌లో ఆర్‌కే మసూరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల పంటలు పూర్తిగా తెల్లకంకి (పొల్లు) రావడంతో పంట పూర్తిగా ఎండుగడ్డి మాదిరిగా మారడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారిణి కమలకు సమాచారం ఇచ్చారు. ఏవో పంటలను పరిశీలించారు. తెల్ల కంకి రావడంతో ధాన్యం గింజలు పొల్లు పోతున్నాయని రైతుల వివరాలను ఆమె సేకరించారు. కేవలం గ్రోమోర్‌లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వరి పంటకే తెల్ల కంకి వచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని ఏవోకు రైతులు వినతి పత్రం అందజేశారు. గ్రోమోర్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం రైతులు పంటలు కోసి విక్రయిస్తుంటే తమ పరిస్థితి ఇలా ఉందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీలో సీనియర్ నాయకులను విస్మరిస్తున్నారు

బాన్సువాడ: బీజేపీలో సీనియర్ నాయకులను కొందరు విస్మరిస్తున్నారని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కన్వీనర్ భూపాల్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వచ్చిన వ్యక్తులు పార్టీని తప్పుదోవ పట్టిస్తున్నారని, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని బాన్సువాడ నియోజకవర్గంలో రాష్ట్ర పార్టీ ఆదేశాలు తీసుకోకుండా కొందరికి బాధ్యతలు అప్పగించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇచ్చి స్థానికులను విస్మరించారని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంపై నిజామాబాద్ నాయకుడి పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకుని బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక బీజేపీ నేతలపై కేసులు పెట్టారని, జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు. కొంత మంది బీజేపీ నాయకులను వెంట పెట్టుకుని బాధ్యతలు అప్పగించడం, సీనియర్ నాయకులను అవమానపర్చడమేనని అన్నారు. మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను రాష్ట్ర కమిటీ నిబంధనల మేరకు నియమించాలని, ఇది వరకు నియమించిన కమిటీలకు గుర్తింపు లేదన్నారు. గతంలో నియమించిన కమిటీలే కొనసాగుతాయని అన్నారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు అర్షపల్లి సాయిరెడ్డి, దావుగారి డాకయ్య, సాయిబాబా, రాజాసింగ్ ఉన్నారు.

క్రైం కార్నర్

పరువుపోయిందని యువకుడి ఆత్మహత్య



మచ్చ ప్రవీణ్ (ఫైల్)

డిచ్‌పల్లి: గ్రామంలో అందరి ముందు ఓ మహిళ గొడవ పడి తిట్టడంతో మనస్తాపానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఘన్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ ప్రవీణ్(35)ను అదే గ్రామానికి చెందిన మల్లుబాయి సోమవారం రాత్రి అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల ముందు తిట్టి గొడవ పెట్టుకుంది. దీంతో తన పరువు పోయిందని మనస్తాపానికి చెందిన ప్రవీణ్ అర్ధరాత్రి ప్రైమరీ స్కూల్ సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య శివరాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మల్లుబాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వెన్నునొప్పి భరించలేక ..

ఎల్లారెడ్డిరూరల్: వెన్నునొప్పి భరించలేక ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేటకు చెందిన మంగళి యాదమ్మ(54) మూడేళ్లుగా వెన్నునొప్పితో బాధ పడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనంతరం మృతదేహాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించ గా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన రెండ్ల పెంటయ్య (81)కు ఏడాది క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. జీవితంపై విరక్తి చెందిన పెంటయ్య సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న రైలు పట్టాలపై మృతదేహం ఉందన్న సమాచారం మేరకు కామారెడ్డి రైల్వే ఎస్సై తావ్యూనాయక్, సిబ్బంది ఘటన స్థలానికి విచారణ చేపట్టారు.

నిజామాబాద్‌లో..

ఖలీల్ వాడి: నగరంలోని గౌతమ్‌నగర్‌కు చెందిన ఇంద్రాల శ్రీనివాస్(56) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసే శ్రీనివాస్ సోమవారం రాత్రి ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిపోయాడని, సోమవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మహిళ..

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ చెరువులో గుర్తు తెలియని మహిళ(45) దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం చెరువులో మహిళ మృతదేహం కన్పించడంతో స్థానికులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. కార్యదర్శి సునీల్ ఫిర్యాదు మేరకు చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. ఒడ్డుపై ఉన్న బ్యాగులో దుస్తులున్నాయి. చెప్పులు ఒడ్డుపైనే వదిలి మహిళ నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి వివరాలు ఎవరికైనా తెలిస్తే డిచ్‌పల్లి సీఐ 8712659851, ఎస్సై 87126 59852 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

మద్యానికి బానిసై..



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన బొరెడ్డి వంశీరెడ్డి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లివచ్చిన వంశీరెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తనకు బైక్ కొనివ్వాలని కొన్నిరోజులుగా తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. మద్యానికి బానిసైన వంశీ ఈక్రమంలో మంగళవారం కుటుంబ సభ్యులతో ఫోన్‌లో వాగ్వాదానికి దిగి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి కారు బోల్తా

- ఒకరి మృతి, పలువురికి స్వల్ప గాయాలు



సులోచన (ఫైల్)

నవీపేట: కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలైన ఘటన మండలంలోని జగ్గారావ్ ఫారం శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కోటగల్లీకి చెందిన సుదర్శన్, సులోచన(45) దంపతులతో పాటు అదే కాలనీకి చెందిన కవిత, శారదా, అనిత సుదర్శన్‌కు చెందిన కారులో ధర్మాబాద్‌కు వెళ్లారు. అక్కడ కారంమిల్లులో మిర్చి కారం పట్టుకుని తిరుగుపయనమయ్యారు. జగ్గారావ్ ఫారం శివారులో కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో సులోచన అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు మనీష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి అదృశ్యం



అరవింద్

కామారెడ్డి క్రైం: పట్టణంలోని కల్కినగర్ కాలనీకి చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు మంగళవారం తెలిపారు. కాలనీకి చెందిన మల్లారెడ్డి అరవింద్ అనే 12 ఏళ్ల బాలుడు దౌల్తాబాద్ హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం కామారెడ్డికి వచ్చాడు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో జీవధాన్ పాఠశాల నుంచి తన తమ్ముడిని తీసుకురావడానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆలస్యం కావడంతో కుటుంబీకులు పాఠశాలకు వెళ్లగా అరవింద్ రాలేదని చెప్పారు. చాలా చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన వీరమల్లి శ్రీనుబాబు ఇంట్లో షట్టర్‌లో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 18 క్వింటాళ్ల 64 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ తహసీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కిష్టయ్య వచ్చి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

బాన్సువాడలో..

బాన్సువాడ: మండల కేంద్రంలోని ఓ గోదాంలో 7.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య మంగళవారం తెలిపారు. ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారం మేరకు గొలీగూడలో అబ్దుల్ రహీంకు చెందిన గోదాంలో దాడి చేయగా 15 బస్తాల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం రహీంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవని అన్నారు.

రూ. 2లక్షల నగదు పట్టివేత



చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్): సంగారెడ్డి– నాందెడ్ జాతీయ రహదారిపై వెల్గనూర్ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.2 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డి తన వాహనంలో రూ.2 లక్షల నగదుతో ఎల్లారెడ్డి వైపు వెళ్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

తండాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట, నెమిలిగుట్ట తండాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడి చేసి 8.5లీటర్ల నాటు సారా, 200లీటర్ల ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య తెలిపారు. నెమిలిగుట్ట తండాకు చెందిన హీన అనే మహిళ నాటు సారాను తయారు చేసి సోమారంపేట గ్రామానికి చెందిన చిట్టవోయిన నర్సయ్యకు ఇవ్వగా, పక్కా సమాచారం మేరకు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టీ స్టాల్‌లో చోరీ

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలోని గంగోళ్ల రమేశ్‌కు చెందిన టీ స్టాల్‌లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. తాళం పగులగొట్టి టీస్టాల్‌లోకి ప్రవేశించిన దుండగులు రూ.3,480 నగదు, ఫోన్, కంప్యూటర్ మానిటర్ ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కెనాల్‌లో పడి యువకుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ప్రమాదవశాత్తు నిజాంసాగర్ ప్రధాన కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బంధువు అంత్యక్రియలకు వెళ్లిన శ్రీకాంత్ స్నానం చేసేందుకు కాలువలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు పడి నీట మునిగి మృతి చెందాడు. ఇప్పటికే ఇద్దరు పిల్లలు ఉండగా, భార్య నిఖిత ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. శ్రీకాంత్ మృతితో వారు దిక్కులేనివారయ్యారని గ్రామస్తులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.